క్లుప్తంగా

పరఖ్ పరీక్షల పరిశీలన



బర్లి యూపీ పాఠశాలలో పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ

బలిజిపేట: మండలంలో నిర్వహిస్తున్న పరఖ్ పరీక్షలను ఎంఈఓ–2 కె.శ్రీనివాసరావు బుధవారం పర్యవేక్షించారు. మండలంలో బర్లి యూపీ, బలిజిపేట, వంతరాం ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షలను ఆయన పరిశీలించారు. విద్యార్థులలో సామర్థ్యాలను వెలికితీసేందుకు ఈ పరీక్షలు దోహదపడతాయని తెలిపారు. 3, 6, 9 తరగతులకు చెందిన విద్యార్థులలో 30మంది విద్యార్థుల వంతున పరీక్షకు ఎంపికచేసి వారికి నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మండలం తాళ్లబురిడి గ్రామంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివాములు దగ్ధమయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. బలగ శంకరరావుకు చెందిన నాలుగు ఎకరాల పంటకు సంబంధించి గడ్డివాములు దగ్ధమైనట్టు తెలిసింది.

గ్రంథాలయంలో ఘంటసాల జయంతి



ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులు

బలిజిపేట: పెదపెంకి నేతాజీ గ్రంథాలయం వద్ద ఘంటసాల జయంతిని బుధవారం నిర్వహించారు. గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు ఆధ్వర్యంలో ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దివంగత అమర గాయకుడు పద్మశ్రీ ఘంటసాలను స్మరించుకోవడం ఎంతో అదృష్టమని తెలిపారు. ఆయన కళామతల్లి ముద్దుబిడ్డ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కె.గౌరీనాథ్, జి.శ్రావణ్‌కుమార్, పి.పరుశురామ్, పి.మురళి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తోనే సురక్షిత ప్రయాణం



మాట్లాడుతున్న సీఐ అప్పలనాయుడు

సాలూరు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతోనే సురక్షిత ప్రయాణం సాధ్యమని సీఐ అప్పలనాయుడు అన్నారు. పట్టణంలో పలు ప్రధాన కూడళ్ల వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడపరాదని తెలిపారు. మితిమీరిన వేగాలతో ప్రయాణం చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అందరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు.

పంచగవ్య ద్రావణం తయారీపై అవగాహన



మిర్తివలసలో ద్రావణం తయారీపై అవగాహన కల్పిస్తున్న ఎంసీఆర్‌పీలు

బలిజిపేట: మండలంలోని మిర్తివలసలో బయో ఇన్పుట్ సెంటర్ వద్ద ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పంచగవ్య ద్రావణం తయారీపై రైతులకు ఐసీఆర్‌పీలు లక్ష్మి, తిరుపతిరావు అవగాహన కల్పించారు. జీడి, మామిడి తోటల కోసం 1,000లీటర్ల పంచగవ్య ద్రావణం తయారీ చేశారు. దీని తయారీ, వినియోగించడంపై అవగాహన కల్పించారు. పండ్లతోటలు, కాయగూర తోటల్లో వినియోగించడం వలన నాణ్యమైన, అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బయో ఇన్పుట్ సెంటర్ యజమాని శ్రీనివాసరావు, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, పాల్గొన్నారు.

ఫైలేరియా, నీటి సమస్యలపై చర్చ



ఫైలేరియా, పీహెచ్‌సీకి సంబంధించి నీటి సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ నాగమణి సూచించారు. బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి ఆధ్వర్యంలో పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. మండలంలో ఫైలేరియా వ్యాధిపై చర్చించారు. అధికారులు దీనిపై దృష్టి సారించాలని ఎంపీపీ నాగమణి సూచించారు. పీహెచ్‌సీకి నీటి సమస్య ఉందని వైద్యాధికారిణి తెలియపరచగా దానిని పరిష్కరించాలన్నారు. 2024 - 25ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.1.75లక్షలు మంజూరవగా దానిలో రూ.1.45లక్షలకు ఖర్చులైన నివేదిక అందించారు. మిగిలిన రూ.30వేలు అత్యవసర ఖర్చులు ఉంటే వాటికి వెచ్చించడం జరుగుతుందన్నారు. నివేదికను కమిటీ సభ్యులు ఆమోదించారు. జెడ్పీటీసీ ఎ.రవికుమార్, ఎంపీడీఓ విజయలక్ష్మి, సభ్యురాలు వెంగళరాయపురం సర్పంచ్ జి.లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

– బలిజిపేట

వేగవంతంగా హౌస్ హోల్డ్ సర్వే



సీతానగరం మండలంలో జరుగుతున్న హౌస్ హోల్డ్ సర్వే వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి కరుణాకర్ ఆదేశించారు. మండలంలోని పెదబోగిలి –1, 2 సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాల్లో ఎంపీడీఓ పి.త్రివిక్రమరావుతో కలిసి సర్వేను బుధవారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి జరుగుతున్న హౌస్ హోల్డ్ సర్వే వేగవంతం చేయాలన్నారు. సర్వే చేసేందుకు ఉపయోగించే పరికరాలతో సాంకేతికపరమైన ఇబ్బందులు వస్తున్న కారణంగా ఆలస్యమవుతున్నా, ప్రత్యామ్నాయంగా సమకూర్చుకుని ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకూ 40 శాతం హౌస్ హోల్డ్ సర్వే పూర్తయిందన్నారు. గ్రామ పెద్దలు, ఎన్యూమరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

– సీతానగరం

రహదారి మరమ్మతులకు వినతి



పట్టణ ప్రధాన రహదారి మరమ్మతులు చేపట్టాలని సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేసారు. ఈ మేరకు బుధవారం కమిటీ సభ్యులతో కలసి ఆర్‌అండ్‌బి డీఈఈ నిర్మలకు వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తవలస రైల్వే వంతనపై, బైపాస్ రోడ్డు, రాయఘడ రోడ్డు, హనుమాన్ జంక్షన్ కంపోస్ట్ యార్డ్ వంటి ప్రధాన రహదారుల్లో గుంతలు ఏర్పడ్డాయన్నారు. వాహనదారులకు పాదచారులకు ఇబ్బందిగా ఉందని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గుర్తించినట్లు చెప్పారు. వెంటనే మరమ్మతు పనులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో వాకాడ ఇందిర, కమిటీ సభ్యులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

– పార్వతీపురం టౌన్

గడ్డిని కలియ దున్నడంతోనే మేలు

- పొలాల్లో గడ్డిని కాల్చడం భూసారానికి నష్టం
- సూక్ష్మ పోషకాలు నశిస్తాయి
- దిగుబడిపై ప్రభావం

బలిజిపేట:

ఖరీఫ్, రబీ సీజన్లలో సాగుకు రైతులు వరి కోత యంత్రాలనే వినియోగిస్తున్నారు. ఖరీఫ్ సీజనులో లభించే గడ్డినే రైతులు ఎక్కువగా పశుగ్రాసం కింద ఉంచుకుంటారు. అయినా ఖరీఫ్ సీజనులో రైతులు యంత్రాలతో కోతలు నిర్వహించడం వలన ఆ గడ్డి నలిగిపోయిందని భావించి ఎండు గడ్డిని పొలాల్లోనే కాల్చి వేస్తున్నారు. దీని వలన భూసారానికి తీవ్ర నష్టం కలుగుతుందని, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. దీనిపై రైతులకు వ్యవసాయ శాఖ అవగాహన కల్పిస్తున్నా ఇలా చేయడం పరిపాటిగా మారింది. గడ్డిని కాల్చకుండా పొలాల్లోనే దాన్ని ఉంచి దమ్ముల సమయంలో కలిపి దున్నడం ద్వారా భూమికి మేలు జరిగే అవకాశాలున్నాయి. ఇటీవల కాలంలో అందుబాటులోకి వచ్చిన స్ట్రావేలర్ యంత్రాలను వినియోగించి ఎండుగడ్డిని సంరక్షించుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. నలిగిన గడ్డిని నిల్వచేసుకోవచ్చని చెబుతున్నారు.

మురగడ దమ్ముతో ఫలితం

ఆరోగ్యవంతమైన భూమిలోని ఒక గ్రాము మట్టిలో టెన్ టు ది పవర్ ఆఫ్ నైన్ సూక్ష్మజీవులు ఉంటాయి. భూమిలో కుళ్లిన పదార్థాన్ని ఇవి ఆహారంగా తీసుకుని మొక్కలకు అవసరమైన సూక్ష్మ పోషకాలను అందిస్తుంటాయి. పొలాల్లోని గడ్డిని కాల్చివేయడం వలన ఈ సూక్ష్మ జీవులు చనిపోయి భూసారానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఇలాంటి పరిస్థితుల వలన రైతులు జింకు, బోరాన్ తదితర చిన్నచిన్న సూక్ష్మ పోషకాలను పొలాల్లో నేరుగా వేయాల్సి వస్తోంది. గడ్డిని తగులబెట్టకుండా పొలంలోనే కుళ్లించి నేలలో కలిపి మురగడ దమ్ము చేస్తే చక్కని ఫలితం ఉంటుంది. ఈ విధంగా చేసేటప్పుడు దమ్ముకు దమ్ముకు మధ్య వారం రోజుల వ్యత్యాసం ఉండాలి. దీని వలన ఈ గడ్డి బాగా కుళ్లి భూమిలో కలిసి మొక్కలకు అవసరమైన సూక్ష్మపోషకాలు సంపూర్ణంగా, సంవృద్ధిగా అందుతాయి.



పంట పొలంలో కాల్చుతున్న గడ్డి. (ఇన్‌సెట్లో) పొలంలో పరిచిన గడ్డి ఇది

నష్టం

గడ్డి కాల్చడం వలన వేడిగాలులతో సమీపంలో ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతుంది. మంటలు ఒక పొలం నుంచి పక్క పొలానికి వ్యాపిస్తే అక్కడ ఉన్న ధాన్యం రాశులతో పాటు చిన్నచిన్న ప్రమాదాలు సంభవిస్తాయి. తోటల పక్క ఉండే పొలంలో ఈ విధంగా గడ్డిని తగలపెడితే తోటలోకి మంటలు వ్యాపించే అవకాశాలున్నాయని రైతులు చెబుతున్నారు.

కాల్చడం వలన భూసారం పోతుంది

గడ్డిని పంట పొలాల్లో కాల్చడం వలన భూసారం పోతుంది. మొక్కలకు మేలు చేసే సూక్ష్మక్రిములు చనిపోతాయి. మళ్లీ సారవంతం చేయాలంటే చాలా కష్టమైన పని. గడ్డిని మడిలో జల్లివేసి కుళ్లినట్టు చేసి దున్నుకోవాలి.

– శ్రావణ్‌కుమార్ నాయుడు, ఏఓ, బలిజిపేట

నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం కావాలి

- పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే జోగారావు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు అతి త్వరలో జరగనున్న నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారథ్యంలో బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో సీతానగరం, పార్వతీపురం మండలాల పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఎన్నికల సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి వనరుల కింద ఉన్న సంఘాలకు మరో వారంలో వివిధ దశల్లో ఎన్నికలు జరగాల్సి ఉండగా గత వారం రోజులుగా వివిధ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా మరోసారి ఎన్నికలు వాయిదా పడినప్పటికీ త్వరలో ఎన్నికల కొత్త షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న ఆయా సాగునీటి వనరుల కింద ఉన్న సంఘాలకు పోటీ చేసేందుకు పార్టీ తరఫున సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల నిర్వహణకు ఇటీవల సాగునీటి వనరుల వివరాలను గెజిట్ సంఖ్య 33/2024 ద్వారా అధికారులు ప్రచురించారన్నారు. పెద్ద తరహా నీటి పారుదల (తోటపల్లి జలాశయం) పరిధిలో నీటి వినియోగదారుల సంఘాలు–22, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు–4, ప్రాజెక్టు కమిటీ–1 ఉన్నాయన్నారు. మధ్య తరహా నీటిపారుదల కింద నీటి వినియోగదారుల సంఘాలు–5, ప్రాజెక్టు కమిటీలు–4, చిన్న నీటి వనరుల్లో నీటి వినియోగదారుల సంఘాలు–166 ఉన్నాయని, మొత్తం 213 నీటి వినియోగదారుల సంఘాలను 1,560 ప్రాదేశిక ప్రాంతాలుగా విభజించి ఎన్నికలు నిర్వహించనున్నారన్నారు. ఎన్నికలకు ప్రతీ ఒక్కరూ సిద్ధం కావాలని సూచించారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఎంపీపీ ప్రతినిధులు బలగ శ్రీరాములు నాయుడు, మజ్జి శేఖర్, జెడ్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు సిద్ధ జగన్నాథరావు, బి.రవికుమార్, సీడీసీ మాజీ చైర్మన్ ఎస్.రామకృష్ణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అంబటి కృష్ణంనాయుడు, నాయకులు ఆర్వీ, ప్రతాప్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి సమస్యలపై వినతి



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న రైతుకూలి సంఘం నాయకులు

మక్కువ: మండలానికి చెందిన రైతుకూలి సంఘం నాయకులు బుధవారం మంత్రి సంధ్యారాణిని కలిసి, సమస్యలపై వినతిపత్రం అందించినట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ, జిల్లా అధ్యక్షుడు ఊయక ముత్యాలు తెలిపారు. పార్వతీపురం ఐటీడీఏ పరిదిధిలోని 170 గ్రామాలను, సీతంపేట ఐటీడీఏ పరిధిలో 241గ్రామాలను షెడ్యుల్ గ్రామాలుగా గుర్తించాలని 1981వ సంవత్సరంలో పార్లమెంట్ స్థాయి కమిటీ నివేదిక సమర్పించినా.. ఇంతవరకు గుర్తించలేదని మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. జీఓ 3ను రద్దుచేయడం వలన చదువుకున్న గిరిజన యువతీ, యువకులు ఉపాధిని కోల్పోతున్నారన్నారు. మక్కువ, సాలూరు మండలాల్లో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను పెత్తందారులు లీజుల పేరుతో వందలాది ఎకరాలను ఆక్రమించుకుంటున్నారన్నారు. మార్కొండపుట్టి, శంబర పంచాయతీలలో దళితులకు అందించిన డీ పట్టా భూములకు, రెవెన్యూ యంత్రాంగం తప్పుడు పట్టాలను సృష్టించి వేరొకరికి అందించి, గొడవలు సృష్టిస్తున్నారన్నారు. దుగ్గేరు గ్రామంలో పీహెచ్‌సీ నిర్మించాలని కోరుతున్నప్పటికీ ఏ ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పీడిక అసిరి, మండల నాయకుడు మర్రి చెంచు తదితరులు పాల్గొన్నారు.

జీఓ 3ను పునరుద్ధరించండి

సాలూరు: జీఓ నంబరు 3ను పునరుద్ధరించాలని రైతు కూలి సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్మ గిరిజన సంక్షేమ శాఖ, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని కోరారు. బుధవారం సంఘం నాయకులు, పలువురు ప్రజలతో కలిసి మంత్రిని పట్టణంలో ఆమె స్వగృహంలో కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పరిధిలోని సుమారు 400కు పైగా గిరిజన గ్రామాలను షెడ్యూల్ గ్రామాలుగా గుర్తించాలని పార్లమెంట్ స్థాయి కమిటీ నివేదిక సమర్పించినప్పటికి ఇప్పటివరకు వాటిని షెడ్యూల్ గ్రామాలుగా గుర్తించలేదని తెలిపారు. నాన్‌షెడ్యూల్ గ్రామాల్లో ఉన్న గిరిజనులు తమ హక్కులను కోల్పోతున్నారని అన్నారు. దుగ్గేరులో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని, గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రికు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాలు, అసిరి, చెంచు వివిధ గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అపరాల సాగు మేలు



పంట పొలంలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ

బలిజిపేట: అపరాల సాగుకు యాజమాన్య పద్ధతులు పాటించడం వలన మంచి దిగుమతులు వచ్చి రైతుకు లాభదాయకంగా ఉంటుందని ఏఓ శ్రావణ్‌కుమార్ నాయుడు తెలిపారు. మండలంలో మిర్తివలస, తుమరాడ గ్రామాల్లో అపరాల సాగుపై రైతులకు మంగళవారం పలు సూచనలు చేశారు. అపరాలలో చిత్త పురుగులు ఉధృతి ఉన్నందున నివారణకు 2.5ఎంఎల్ క్లోరోఫైరిపాస్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. కలుపు సమస్య ఉంటే 15నుంచి 20రోజుల్లో నివారణకు ఇమజితొసెర్ అనే కలుపు మందు 400ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. పంట దశ 20 నుంచి 25రోజులు ఉన్నప్పుడు 19–19–19ఎకరాకు ఒక కిలో 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందిని సలహాలు అడిగి తెలుసుకుని యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచిదన్నారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి

పార్వతీపురం టౌన్: గిరిజన గురుకుల పాఠశాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల, అధ్యాపకుల న్యాయమైన సమస్యలు పరిష్కారానికి ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, ఆదివాసీ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు కోలక లక్ష్మణమూర్తి డిమాండ్ చేసారు. ఈ మేరకు పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం ఎదుట జరుగుతున్న దీక్షలకు ఆయన బుధవారం మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం ఇవ్వక పోవడం, ఉద్యోగ భద్రత లేకపోవడంతోనే గురువులు పోరుబాట పట్టారని ప్రభుత్వం అర్థం చేసుకోవాలన్నారు. కేబినెట్ మంత్రిగా గిరిజన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చొరవ చూపి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్, శ్రామిక మహిళా సంఘం నాయకులు వాకాడ ఇందిరా, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సంఘం నాయకులు దివాకర్, వెంకట్, రాజేష్, రమేష్, కామేష్, జగదీష్, తిరుపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వసతి లేని శిక్షణతో అభ్యర్థుల అవస్థలు

పార్వతీపురం టౌన్: వసతి సౌకర్యం లేకుండా గిరిజనులకు ఇస్తున్న ఉచిత డీఎస్సీ శిక్షణ వల్ల గిరిజన అభ్యర్థు అవస్థలు పడుతున్నారని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ శిక్షణలో కేవలం మధ్యాహ్నం భోజనం మాత్రమే పెట్టి వసతి సౌకర్యం లేకుండా గిరిజన ప్రాంత అభ్యర్థులు రాకపోకలు చేసి డీఎస్సీ పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం కాగలరని ఆయన ప్రశ్నించారు. ప్రయాణానికే నాలుగు గంటలు పడుతుందని చెప్పారు. వసతి సౌకర్యంతో కూడిన శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేసారు. కేవలం ఎస్‌జీటీలకు మాత్రమే శిక్షణ ఇస్తున్నారని మరి పాఠశాల సహాయకులు, బాషా పండితుల పోస్టులకు పోటీ పడే అభ్యర్థుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. శిక్షణకు కేవలం నలభై మంది మాత్రమే హాజరయ్యారని అందులో సగం మంది మాత్రమే గిరిజన అభ్యర్థులని పేర్కొన్నారు. ఐటీడీఏలో దరఖాస్తు చేసుకున్న వారికి ఇక్కడ అవకాశం లేకుండా పోయిందన్నారు. తక్షణమే మూడు పూటలా భోజనం, వసతి సౌకర్యాలతో పేద గిరిజన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేసారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

మక్కువ: మండలంలోని 21పంచాయతీల్లో ఈ నెల 6వ తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షేక్ ఇబ్రహీం బుధవారం తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో ఆయన బుధవారం మాట్లాడారు. ఈ నెల 6న మండలంలోని వెంకటభైరిపురం, దబ్బగెడ్డ పంచాయతీలలో రెవెన్యూ సదస్సులు న్ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

కుంగిన కర్రివలస కాజ్‌వే



కాజ్‌వే కుంగిపోవడంతో నిలిచిపోయిన లారీ

పాచిపెంట: మండలంలోని కర్రివలస గ్రామ రహదారి మధ్యలో కారిగెడ్డపై ఉన్న కాజ్‌వే బుధవారం కుంగిపోయింది. గ్రామానికి రోడ్డు పనుల నిమిత్తం మెటీరియల్ తీసుకువెళ్తున్న లారీ కాజ్‌వే మీదకు ఎక్కేసరికి కాజ్‌వే కుంగిపోయింది. లారీ మధ్యలో కూరుకుపోవడంతో ప్రమాదం తప్పింది. కాజ్‌వే కుంగిపోవడంతో గ్రామానికి రాకపోకలు నిలిచాయి. లారీని బయటకు తీసినప్పటికి, రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీనితో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సూర్యనారాయణ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం:

మండలంలోని చినబోగిలి వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ గొర్జ సూర్యనారాయణ కుటుంబాన్ని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు బుధవారం పరామర్శించి సంతాపాన్ని వెలిబుచ్చారు. సూర్యనారాయణ సతీమణి సరోజనమ్మ ఇటీవల గుండెపోటుకు గురై మృతి చెందినట్లు తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు, ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములునాయుడు తదితరులు సూర్యనారాయణను పరామర్శించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్‌సీపీ నాయకులకు కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట చినబోగిలి సర్పంచ్ కురమాన రాధ, బీసీ కార్పొరేషన్ మాజీ డైరక్టర్ ఎస్.తిరుపతిరావు, కె.శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, మండల నాయకులు ఆర్వీ పార్థసారది తదితరులు ఉన్నారు.

తూరుమామిడిలో పొలం పిలుస్తోంది...



మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు

మక్కువ: మండలంలోని తూరుమామిడి గ్రామంలో ఏఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్.శ్రీనివాసరావు హాజరై, అపరాల పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీ విత్తనానికి 2.5గ్రాముల కార్బండిజమ్, 5ఎంఎల్ ఇమిడాక్లోప్రిడ్ మందుతో విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. దీనివలన 20రోజుల వరకు పురుగులు, తెగుళ్లు సోకకుండా నివారించుకోవచ్చునని తెలిపారు. కలుపు, గడ్డి, గరిక జాతి మొక్కలు నివారణకు ఫినాక్సిప్రాప్‌ఇథైల్ 5శాతం 250ఎంఎల్ ద్రావణాన్ని, 200లీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆకు గడ్డిజాతి కలుపు నివారణకు 200ఎంఎల్ ఇమాజిత్ఫైర్ 200లీటర్లు నీటిలో పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ దివ్య, సీఆర్‌పీ నాగార్జున, రైతులు పాల్గొన్నారు.